పల్లెకు చంద్రగ్రహణం

- 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలలో జాప్యం
- పంచాయతీలకు కూటమి మొండి చేయి
- నియోజకవర్గానికి 3.60 కోట్ల బకాయిలు

నిడదవోలు రూరల్: 'స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా మార్చాలి. పంచాయతీలకు నేరుగా నిధులు, స్థానిక సంస్థలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక పటుత్వం అవసరం' ఈ ఏడాది పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్న అంశాలు. కాని స్థానిక సంస్థల వాస్తవ పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో గ్రామపంచాయతీల్లో ఖజానాలు ఖాళీగా ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గతేడాది నవంబర్ నెలలో మొదటి విడత నిధులు గ్రామపంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు సంబంధించి విడుదలైయ్యాయి. ఈ నేపథ్యంలో 2వ విడత నిధులు ఈ ఏడాది మార్చిలోగా విడుదల కావాల్సి ఉండగా నేటికి విడుదల కాలేదు. మేజర్ గ్రామపంచాయతీలకు పలురకాల ఆదాయ వనరులు ఉన్నా కారణంగా ఏదో ఒక విధంగా నెట్టుకొచ్చినా, ఎలాంటి ఆదాయ వనరులు లేని మైనర్ గ్రామపంచాయతీలు ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే గ్రాంట్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో అయా పంచాయతీల్లో కనీసం సిబ్బందికి జీతాల చెల్లింపు, వీధి బల్బులు, బ్లీచింగ్ పౌడర్ కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో ఉన్నాయి.

ప్రజాప్రతినిధులపై కక్ష సాధింపా..

నిడదవోలు నియోజకవర్గంలోని 2వ విడత నిధులు ఈ ఏడాది మార్చిలోగా నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో ఉన్న 56 గ్రామాలకు, మూడు మండల పరిషత్, మూడు జిల్లా పరిషత్‌లకు రూ.3.60 కోట్లు మంజూరుకావాల్సివుంది. స్థానిక సంస్థల్లో అత్యధిక భాగం వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులే ఉన్న కారణంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడితే వారికి మంచిపేరు వస్తుందనే కక్షతో కూటమి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధుల విడుదలకు మోకాలడ్డుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా పాలన ఉంటుందని గ్రామీణాభివృద్ధి శాఖను ఏరికోరి తీసుకున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడకపోవడం శోచనీయమనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ప్రతినిధులు నిరసనలు వ్యక్తం చేయడంతో పాటు ఈ నెల 21న జిల్లా కలెక్టర్‌లకు వినతి పత్రాలు అందజేసి తమ ఆవేదన వ్యక్తం చేశారు.

జీతాలు చెల్లించలేని దుస్థితి..

15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా టైడ్,బేసిక్ గ్రాంట్ల రూపంలో నిధులు స్థానిక సంస్థలకు విడుదలవుతాయి. టైడ్ కింద విడుదలైన నిధుల్లో 50 శాతం నిధులను తాగునీటి అవసరాలకు మిగిలిన 50శాతం నిధులను పారిశుద్ధ్యానికి వెచ్చించాల్సివుంది. అలాగే బేసిక్ గ్రాంట్ కింద విడుదలైన నిధులను గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైయిన్లు, ఇతర మరమ్మతులకు వినియోగించుకునే సౌలభ్యం ఉంది. అయితే ఈ గ్రాంట్లు 8 నెలలుగా విడుదల కాకపోవడంతో మైనర్ పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

ఆందోళనకు సిద్ధమవుతున్న సర్పంచులు

రాష్ట్ర ప్రభుత్వం తీరుపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు సంబంధించి గత కొన్ని నెలలుగా సీఎం, డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌కు పలు మార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎటువంటి ఫలితం లేదని వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాజధానిలో నిరసనకు సిద్ధం అయ్యేందుకు కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

ఆర్థిక సంఘం నిధులే అధారం..



గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులే ఆధారం. సకాలంలో ఈ నిధులు విడుదలైతే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకొవాలి.

– కొండపల్లి శ్రీనివాస్, సర్పంచ్, కంసాలిపాలెం.
వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

గ్రామాభివృద్ధికి ఆటంకం



మైనర్ పంచాయతీల్లో ఎలాంటి ఆదాయ వనరులు లేవు. పాలక ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో గ్రామాభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. గ్రామంలో పారిశుధ్య పనులు, పైపులైన్ల రిపేర్లను చేపట్టలేకపోతున్నాం.

– నాగిరెడ్డి నాగదేవి, సర్పంచ్, డి.ముప్పవరం.



నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామ సచివాలయ భవనం



నిధుల విడుదలపై కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సర్పంచులు



నిడదవోలు మండలం రావిమెట్ల ఎస్సీ కాలనీలో వర్షం వస్తే రోడ్డు దుస్థితి

లక్ష తులసి పూజ



స్వామికి అలంకరించిన తులసి మాలలు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపుర గ్రామంలోని శ్రీరామ్ నగర్ రామాలయం వద్ద ఆదివారం శ్రీరామ జపంతో లక్ష తులసి ఆకులతో పూజను వైభవగా నిర్వహించారు.ఆధ్యాత్మిక ప్రవచన కర్త పరస రాధాకృష్ణ గత 15 నెలలుగా చేస్తున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాలు పూర్తయిన సందర్భంగా లక్ష తులసి పూజతో ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. 80 మంది రామభక్తులు శ్రీరామ నామ స్మరణ చేస్తూ ఐదు గంటలపాటు లక్ష తులసి పూజను నిర్వహించారు. పూజ అనంతరం చేసిన అలంకరణ భక్తులను విశేషంగా అలరించింది. మహిళలకు అన్నప్రసాద వితరణ ప్రసాదాలను అందజేశారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



సమిశ్రగూడెంలో తనిఖీలు చేస్తున్న ఎస్సైలు ఎల్.బాలాజీ సుందరరావు, కల్పన

నిడదవోలు రూరల్: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు హెచ్చరించారు. మండలంలోని సమిశ్రగూడెం పురాతన వంతెన వద్ద ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ప్రతి ఒక్కరూ వాహనాల ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. బైక్‌పై ముగ్గురు ప్రయాణించడంతో పాటు, మద్యం సేవించిన పలువురు వాహనాదారులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో ట్రైనీ ఎస్సై జి.కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.

నాటిన మొక్కలను పరిరక్షించాలి



పట్టణంలో మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

నిడదవోలు: ప్రశాంతమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. వన సంరక్షణలో భాగంగా రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, గుంటిపల్లి సత్యసాయి, పోలదాసు శ్రీనివాసరావు, నీలం నాగేంద్రప్రసాద్, ఉప్పులూరి రామ్మోహన్ రావు, గాజుల రంగారావు, గుంటిపల్లి శివ, యాసరపు రామకృష్ణ, ఎండి ఫయాజ్, ఉజ్జిన బలరాం, జయవరపు కోటేశ్వరరావు, సానేపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఆదివారం నిడదవోలు, చాగల్లు మండలాల షామియానా, లైటింగ్, ఫ్లవర్ డెకరేషన్ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూరిజం శాఖలో లైటింగ్, డెకరేషన్ ఈవెంట్‌లు మిళితమై ఉందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞాన దిశగా ఈవెంట్స్ కూడా ప్రణాళికలు చేసుకుని సమాజంలో ఉన్నతంగా నిలబడాలని ఆకాంక్షించారు. నూతన సంఘ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ, కార్యదర్శి పట్టపగలు ప్రసాద్, ఉపాధ్యక్షుడు కొల్లి శ్రీను, కోశాధికారి సత్యనారాయణతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులతో మంత్రి ప్రమాణస్వీకారం చేయించారు.

తాళ్లపూడి (కొవ్వూరు): రైతుల పరస్పర సహకారంతో సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని కాపవరం సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారమహోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా సుంకర సత్తిబాబు, ఇతర నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు.

తక్కువ వ్యయం..ఎక్కువ లాభం

- పొలాల్లో గొర్రెల మందకట్టలు
- భూసారం పెంచేందుకు కృషి



అనంతపల్లి శివారు సంజీవపురం పొలాల్లో సంచరిస్తున్న గొర్రెల మందలు

నల్లజర్ల: మోతాదు మించి ఎరువులు,పురుగు మందులు వినియోగంతో భూసారం నానాటికి తగ్గిపోతుంది. ఈ పరిస్థితులు భవిష్యత్తురాలకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి బి.సోమశేఖరం రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దింతో రైతుల ఆలోచన విధానంలో మార్పు కొంత మెర వస్తోంది. గొర్రెలు,మేకలు మందలను కాపు కాయడం, చెరువు పూడిక మట్టి పొలాల్లో వేయడం ,కుళ్లిన గత్తం వేసుకోవడం, పచ్చిరొట్టసాగు వంటి పద్ధతులను అనుసరిస్తున్నారు. ప్రస్తుతం పొగాకు పంటకాలం పూర్తయింది. ఖాళీగా ఉన్న భూముల్లో పగటి వేళల్లో మేకలు, గొర్రెలు తిప్పడంతో పాటు రాత్రుళ్లు అక్కడే మంద కట్టడంతో భూసారాన్ని పెంచుకోవచ్చునని రైతులు చెబుతున్నారు. అధికంగా రసాయనిక ఎరువులు వాడిన భూముల్లో ఇలా గొర్రెల మందలను కట్టడంతో మలమూత్రాలు విసర్జనతో భూముల్లో చౌడు విరిగిపోతుందంటున్నారు. వీటి విసర్జితాల్లో నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు ఉంటాయని వివరిస్తున్నారు. మంద కట్టిన తర్వాత భూమిని దున్నుకోవాలని, మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెంది, తెగుళ్ల తగ్గుతాయన్నారు.

ఆగని ఆక్రమణల పర్వం



ఆక్రమణలపై గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

నల్లజర్ల: నల్లజర్ల ప్రాథమిక –1 పాఠశాల పక్కన మట్టిమెరక చేసి ఆక్రమణలకు తెరతీస్తున్నారని వాటిని నిలుపుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కూరపాటి నాగరాజు యస్‌యంసీ చైర్మన్‌గా ఉన్న సమయంలో పాఠశాల ప్రహరీగోడకు ఆనుకుని చేపల విక్రయాలు నిత్యం సాగించడంతో దుర్వాసనకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనేవారమని వాపోయేవారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల అవస్థలను పలుమార్లు విక్రయదారుల దృష్టికి తీసుకెళ్లినా ఖాతరు చేయకపోవడంతో వివాదం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లడంతో ఎట్టకేలకు వాటిని తొలగించారు. ప్రస్తుతం కొత్తగా పాఠశాల ప్రహరీ గోడ పక్కనే మట్టి మెరక చేసి పాకలు వేసే ప్రయత్నంలో ఉన్నారు. క్రీడాలకు సరైన ఆటస్థలం లేదని, ఉన్న స్థలం ఆక్రమణలకు గురైతే రానున్న కాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని తల్లిదండ్రులు తెలిపారు. మండల పరిషత్, గ్రామపంచాయతీ అధికారులు జోక్యం చేసుకొని పాఠశాల పరిధిలోని ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని కోరుతున్నారు.

ఆయకట్టు భూములకు నీటి విడుదల

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెంలో ఆయకట్టు భూములకు తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ ద్వారా సాగునీటిని సరఫరా చేస్తున్నట్టు ఆర్‌ఎంసీ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'బీటలు వారుతున్న వరిచేలు' అనే శీర్షికతో ఈ నెల 17న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కృష్ణంపాలెంలో ఈ నెల 17న సబ్ డివిజన్ కార్యాలయా అధికారులు పంట పొలాలను పరిశీలించినట్టు ఆయన వివరించారు. రైతుల అభ్యర్థన మేరకు తాడిపూడి కాలువ ద్వారా కృష్ణంపాలెం,ఇతర గ్రామాల పంట పొలాలకు నీటి సరఫరా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ఆయకట్టు భూములకు సాగునీరు సరఫరా అవుతున్నట్లు రైతులు తెలిపారని చెప్పారు. ఖరీఫ్ పంటలకు ఎటువంటి సాగునీటి ఎద్దడి లేదని ఆయన వివరణ ఇచ్చారు.

సాక్షి ఇంపాక్ట్

గోతుల రోడ్లతో అవస్థలు



అధ్వాన్నంగా తయారైన త్యాజంపూడి-యర్నగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డు



తాడిపూడి కాలువ వంతెనపై ప్రమాదకరంగా ఉన్న ఇనుప ప్లేట్

- గోతుల మయంగా ఆర్‌అండ్‌బీరోడ్లు
- మరమ్మతుల్లో లోపించిన నాణ్యత

దేవరపల్లి: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మెట్ట ప్రాంతంలోని పలు రహదారులు భారీ గోతులతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అడుగుకో గుంత..గజానికో గొయ్యిగా రహదారులు ఉండడంతో ప్రయాణీకులు నరకం చూస్తున్నారు. ఈ మార్గాల్లో ప్రయాణించాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా ఆర్‌అండ్‌బీ రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నాయని వాపోతున్నారు. గోతుల్లో వర్షపునీరు చేరడంతో అంచనా వేయలేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. త్యాజంపూడి నుంచి యర్నగూడెం వరకు సుమారు 2 కిలో మీటర్ల రహదారి దాదాపు 10 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఈ రెండు కిలో మీటర్ల రహదారిపై వెళ్లాలంటే ప్రయాణీకులు జంకుతున్నారు. నిడదవోలు నుంచి పొంగుటూరు వరకు ఉన్న ఈ రహదారి దాదాపు 10 గ్రామాల ప్రజలకు ప్రధాన రహదారిగా ఉంది.

నాణ్యత లేని పనులు..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రెండు కిలో మీటర్ల రహదారిని సుమారు రూ.27 లక్షల వ్యయంతో మరమ్మతులు చేశారు. మరమ్మతులు చేసి ఏడాది కాకుండానే మరలా రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. యర్నగూడెం-సంగాయగూడెం మధ్య తాడిపూడి కాలువపై నిర్మించిన వంతెనకు జాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన ఇనుప ప్లేట్ ప్రమాదకరంగా పైకి లేచి ఉంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వెళ్లే సమయంలో ప్లేట్ తగిలి టైర్లు పాడవుతున్నాయని, వంతెనపై పెద్ద గొయ్యి పడడంతో ప్రమాదాలకు గురవుతున్నట్టు తెలిపారు. యాదవోలు-పొంగుటూరు మధ్య రోడ్డు దుస్థితి మరింత దారుణంగా ఉంది. తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారడంతో గోతులు చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

నివేదికలు పంపించాం

నిడదవోలు-పొంగుటూరు రహదారిని అమ్మేపల్లి నుంచి పొంగుటూరు వరకు విస్తరణ కోసం రూ.7 కోట్ల వ్యయంతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేధికలు పంపించాం. త్యాజంపూడి-యర్నగూడెం మధ్య 2 కిలో మీటర్లు రోడ్డు విస్తరణ చేయవలసి ఉంది. గతేడాది రూ. 27 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టాం. భారీ వర్షాలకు రోడ్డు మరలా గుంతలుగా మారింది. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం.

–ఆర్‌అండ్‌బీ ఏఈ, శ్రీనివాస్ విజయ్,

3,700 క్యూసెక్కుల నీరు విడుదల



పశ్చిమడెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. విస్తారంగా వర్షాలు కురవడంతో విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి ఆదివారం 3,700 క్యూసెక్కుల గోదావరి జలాలను కాలువలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.99 మీటర్లు నమోదయ్యింది. పశ్చిమడెల్టా పరిధిలో నరసాపురం కాలువకు 1501 క్యూసెక్కులు, తణుకు కాలువకు 328 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 632 క్యూసెక్కులు, ఉండి కాలువకు 804 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 330 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

చాగల్లు: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం చాగల్లులో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజవర్గంలో పలు సమస్యలు పరిష్కరించాలని, వాటికి నిధులు మంజూరు చేసే విధంగా తగిన చర్యలు తీసుకొవాలని మంత్రిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. అనంతరం ఇరువురు నాయకులు గ్రామంలో పర్యటించి కూటమి ప్రభుత్వ పథకాలపై కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెరవలి: గుర్తు తెలియని ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెరవలి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. తీపర్రులో ర్యాలీ లక్ష్మణరావుకు సంబంధించిన పొలం వద్ద ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని పెరవలి ఏఎస్సై సూర్య చంద్రరావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై తెల్లబనియన్, నీలం రంగు గళ్ల లుంగీ ఉన్నాయని తెలిపారు. ఎత్తు 5.2 అడుగులు ఉంటుందన్నారు. మృతుడి వివరాలు తెలియవలసి ఉందన్నారు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

మృత్యు మలుపులు



చాగల్లు-చిక్కాల రోడ్డులో ప్రమాదకరంగా మలుపు



పశివేదల -వేములూరు రహదారిలో ..

- గోతుల మయంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు
- మరమ్మతుల్లో లోపించిన నాణ్యత

చాగల్లు: కొవ్వూరు నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారుల్లో అనేక చోట్ల మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలవలపల్లి-చిక్కాల, చాగల్లు-చిక్కాలపాలెం, నిడదవోలు-పంగిడి ఆర్ అండ్ రహదారి, దారవరం-కొవ్వూరు రహదారి, చాగల్లు-నందమూరు, చాగల్లు-పశివేదల, పశివేదల- వేములూరు తదితర రహదారుల్లో ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద ఏ మాత్రం ఏమరపాటు వహించినా ప్రమాదం తప్పదని స్థానికులు అంటున్నారు. గతంలో అనేక ద్విచక్రవాహనదారులు, వాహనాలు ప్రమాదాల బారిన పడ్డా సందర్భాలు ఉన్నాయని తెలిపారు. నిడదవోలు-పంగిడి రహదారి, చిక్కాల రోడ్డులో ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికై నా స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకొవాలని కోరుతున్నారు.

స్వామి దర్శనానికి వెళ్లి వస్తూ మృతి

- నిద్రమత్తులో వ్యాన్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

పెరవలి: పెరవలి ఎస్ఆర్‌కె మిల్లు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు పెరవలి ఏఎస్ఐ సూర్య చంద్రరావు తెలిపిన వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా రాయలం గ్రామానికి చెందిన కొమ్మోజు విశ్వేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి వాడపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు పెరవలి వద్దకు చేరుకునే సరికి డ్రైవింగ్ చేస్తున్న విశ్వేశ్వరరావు కుమారుడు నిద్రమత్తులోకి జారుకోవడంతో రోడ్డు పక్కనే ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని, అనంతరం ఐషర్ వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిలిస్ట్‌కు తీవ్ర గాయాలు కాగా, కారులో ఉన్న విశ్వేశ్వరరావు, అతని భార్య, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారన్నారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వటంతో నలుగురి క్షతగాత్రులను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో విశ్వేశ్వరరావు (55) మృతి చెందాడని వివరించారు. మిగిలిన ముగ్గురు వైద్యం అందుతుందని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్ట్

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో ఆదివారం కోడిపందేల శిబిరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు తమకు అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒక కోడి, ఒక కత్తి రూ.1,050 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు. కోడి పందేలు, పేకాట ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంధకారంలో హండ్రెడ్ ఫీట్ రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం హండ్రెడ్ ఫీట్ రోడ్డులో నెల రోజులుగా అంధకారం రాజ్యమేలుతోంది. వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసర గ్రామాల నుంచి ఎస్వీ జనరల్ మార్కెట్, నగరంలోని వివిధ ప్రాంతాలకు వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ నగరపాలక సంస్థ అధికారుల్లో మాత్రం చలనం లేదు. నగరపాలక సంస్థ పరిధిలో ఏ సమస్యలున్నా.. వాట్సాప్ నంబరుకు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్, ప్రస్తుత ఇన్‌చార్జి నగరపాలక సంస్థ కమిషనర్ ప్రకటించినప్పటికీ.. ఆచరణలో మాత్రం కానరావడం లేదు. హండ్రెడ్ ఫీట్ రోడ్డులో వీధిలైట్లు వెలగడం లేదని ప్రజలు ఫిర్యాదు చేసినా.. ఇప్పటి వరకు స్పందించలేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే వాట్సాప్ నంబర్లు మినహా, ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

